క్లుప్తంగా

ఆలయ ఆదాయం రూ.15.04 లక్షలు



నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది తదితరులు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మదేవత శివరామాలయాల దేవస్థానం హుండీలను దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ శేఖర్, ఈఓ స్నేహలత, ఆలయ ట్రస్టీ శిరోలి సమక్షంలో బుధవారం లెక్కించారు. 76 రోజులకు రూ.15,04,074 ఆదాయం వచ్చిందని, ఈ మొత్తాన్ని కడ్తాల్ కెనరాబ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు ఈఓ తెలిపారు. ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, సిబ్బంది యాదగిరిస్వామి, చంద్రయ్య, రాములు, కృష్ణ ,శ్రీని వాస్, శ్రీనివాసులు, పత్యానాయక్, హర్షవర్ధన్, బ్యాంకు సిబ్బంది లక్ష్మీనారాయణ, అన్నపూర్ణ సేవా ట్రస్ట్ సభ్యులు తదితరులు ఉన్నారు.

నేడు మంత్రి కోమటిరెడ్డి రాక

ఇబ్రహీంపట్నం రూరల్: పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలు ఆదిబట్ల మున్సిపాలిటీలో పర్యటించనున్నారని చైర్మన్ నిరంజన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మంత్రి రానున్నారని చెప్పారు. రూ.25 కోట్లతో ఆదిబట్ల నుంచి బొంగ్లూర్ వరకు బీటీ రోడ్డు పనులు, పటేల్‌గూడ, బొంగ్లూర్, ఆదిబట్ల టౌన్‌లో రూ.3.60 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు సకాలంలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు గురువారం అంతరాయం కలగనుందని ఏడీఈ సీతారాములు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పట్నం టౌన్, ఎంబీనగర్, శేరిగూడ, కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ, ఖానాపూర్ గ్రామాలతో పాటు గురునానక్ కాలేజీ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శ్రీరాముడి జీవితం ఆదర్శం



అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మాడ్గుల: శ్రీరాముడి జీవితం అందరికీ ఆదర్శమని బీజేపీ గ్రామ అధ్యక్షుడు మాదసు వెంకటయ్య అన్నారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ పునఃప్రతిష్ఠించి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మండల పరిధి ఇర్విన్‌లో బుధవారం రామాలయంలో సీతారాములకు అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని, ఆలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో భక్తులు దామర్ల అశోక్, హరీశ్ రెడ్డి, రమేష్, రాము, నరేష్, శివ, యాదయ్య, భక్త బృందం పాల్గొన్నారు.

ఆ భూములకు రైతుభరోసా ఇవ్వొద్దు

అబ్దుల్లాపూర్‌మెట్: 'సుర్మాయిగూడ రెవెన్యూ పరిధిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే.. కొందరు భారీ నిర్మాణాలు చేపట్టారు. అలాంటి వ్యక్తులకు రైతు భరోసా ఇవ్వకూడదు' అని గండిచెరువు గ్రామానికి చెందిన రైతు రొక్కం జనార్దన్ రెడ్డి బుధవారం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సుర్మాయిగూడ గ్రామంలోని సర్వే నంబర్ 145,146,147,148, 149లో ఉన్న భూముల్లో ఇప్పటికే షెడ్లు వేసి అద్దెకు ఇస్తున్నారని, గత ప్రభుత్వంలో అధికారులను మభ్యపెట్టి రైతు బంధు తీసుకున్నారని, ఇప్పుడు కూడా భరోసా తీసుకునేందుకు పలువురు యత్నిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత అర్హుల జాబితాలో వారి పేర్లు ఉన్నాయని స్పష్టంచేశారు. జాబితా నుంచి వారి పేర్లను తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

శ్రీవారి హుండీ లెక్కింపు

మీర్‌పేట: జిల్లెలగూడ శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ హుండీని బుధవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. 12 డిసెంబరు 2024 నుంచి జనవరి 22 వరకు ఆదాయం రూ.2 లక్షల 91 వేల 356 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వరచారి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పార్టీలకు అతీతంగా జాబితా
- ప్రజలు అపోహలకు లోనుకావద్దు
- గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు
- ఊరూరా గ్రామసభలు, దరఖాస్తుల స్వీకరణ



కడ్తాల్: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్/ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కొత్తగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల అర్హుల జాబితా జారీ ప్రక్రియలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన అర్హుల పేర్లను ప్రదర్శించారు. ప్రజాభిప్రాయాలు తీసుకున్నారు. అర్హత ఉండి జాబితాలో పేర్లు లేని వారి నుంచి కొత్తగా అర్జీలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ప్రతి పక్షాల మాటలు నమ్మి ప్రజలు అపోహలకు లోనుకావద్దని సూచించారు. ఇందులో మార్కెట్ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల ప్రత్యేకాధికారి రామేశ్వరిదేవి, ఏడీఏ ఆదిలక్ష్మీ, ఎంపీడీఓ సుజాత, ఏఓ శ్రీలత, సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలు

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తుండగా.. ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవపట్టించి, ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి ఆరోపించారు. ఆమనగల్లు మండల పరిధి పోలెపల్లి రైతువేదికలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని చెప్పారు. ఇందులో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ మాజీ చైర్మన్ నారాయణ, మాజీ సర్పంచ్ బలరాం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్, ఎంపీడీఓ మాధురి, సీఐ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత అన్నారు. ఇంజాపూర్ వార్డు కార్యాలయ సభలో ఆమె ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జాబితాలో పేర్లు లేని మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో కౌన్సిలర్లు శ్రీలత, రవీందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మా దరఖాస్తులు ఏమయ్యాయి?



వార్డు సభలో కమిషనర్ వసంతను ప్రశ్నించిన పలువురు గ్రామస్తులు

ఆమనగల్లు: 'మేము ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్నాం. కొందరికే వచ్చాయి. మరి మా దరఖాస్తులు ఏమయ్యాయి. మాకు జాగ ఉన్నా, ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు రాలేదు. ఇళ్లు ఉన్నవారికే మరోసారి మంజూరు చేస్తున్నారు' అంటూ ప్రజలు అధికారులను నిలదీశారు. మండల పరిధి గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో వార్డుల్లో కమిషనర్ వసంత, చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్యల ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. అర్హుల పేర్లను వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని అధికారులను ప్రశ్నించారు. మంగళపల్లి సభలో పలువరు నిరసన వ్యక్తంచేశారు. ఎంపీడీఓ మాధురి, తహసీల్దార్ లలిత, ఏడీఏ ఆదిలక్ష్మి, ఏఓ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మేము పేదవారమే..



యాచారం: చింతుల్ల గ్రామంలో దరఖాస్తు చేసుకుంటున్న మహిళలు

యాచారం: 'మేము పేదవారమే. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు మావి. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో మా పేర్లు ఎందుకు లేవు' లేవని గ్రామస్తులు కొందరు అధికారులను నిలదీశారు. మండల పరిధి గడ్డమల్లయ్యగూడ, చింతుల్ల, చౌదర్‌పల్లి, గునుగల్, ధర్మన్నగూడెం, యాచారంలో నిర్వహించిన గ్రామసభల్లో ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, మండల పరిషత్ అధికారి శ్రీలతలు సంక్షేమ పథకాల అర్హుల పేర్లను చదివి వినిపించారు. ఈ సందర్భంగా లిస్టులో మా పేర్లు ఎందుకు లేవని కొందరు ప్రశ్నించారు. ధర్మన్నగూడెంలో గ్రామస్తులు సభను వాకౌట్ చేశారు. గునుగల్‌లో పేదవారికి ఏ పథకాలు రావని, అన్ని ధనికులకే వస్తాయని ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు, పోలీసులు వారించడంతో సమస్య సద్దుమణిగింది. అర్హులందరికీ పథకాలు అందుతాయని, మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించగా.. ప్రజలు అర్జీ పెట్టుకున్నారు.



అబ్దుల్లాపూర్‌మెట్: అనాజ్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: వార్డు సభలో.. చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి తదితరులు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల రాందాస్‌పల్లి సభలో.. కమిషనర్ బాలకృష్ణ

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ తదితరులు

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధి పలు వార్డుల్లో బుధవారం అభివృద్ధి పనులను ప్రారంభించారు. పట్టణంలోని ఆరో వార్డులో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కౌన్సిలర్ దివ్య ప్రారంభించారు. అదే వార్డులో రూ.5 లక్షలతో తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దుర్గయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు హరిప్రసాద్, కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, శ్రీశైలంయాదవ్, చెన్నకేశవులు, కో ఆప్షన్ సభ్యులు శ్రీదర్, పాష, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విక్రంరెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, నాయకులు రాంరెడ్డి, గుజ్జరి శ్రీను, సాయికుమార్, శ్రీశైలం యాదవ్, శ్రీను, బాలకృష్ణ, సుభాష్, జానయ్య, చంద్రయ్య, జి.నర్సింహ, కృష్ణయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

16 వార్డుల్లో సభలు పూర్తి

మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్



సభలో మాట్లాడుతున్న కమిషనర్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ 24 వార్డుల్లో 16 వార్డుల సభలు ప్రశాంతంగా ముగిశాయని మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్ తెలిపారు. బుధవారం ఎంబీఆర్ నగర్‌లో వార్డు కార్యాలయంలో 9వ వార్డు సభను నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ గురువారం మరో 8 వార్డుల్లో సభలు జరుగుతాయని, దీంతో మున్సిపాలిటీలో కార్యక్రమం పూర్తవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు 16 వార్డుల నుంచి రేషన్ కార్డుల కోసం 458, ఇందిరమ్మ ఇళ్లకు 248 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. తాజా అర్జీలపై సర్వేచేసి, అర్హులను ఎంపిక చేస్తామని వెల్లడించారు. సభలో ప్రత్యేకాధికారి మణికుమార్, కౌన్సిలర్ మమత, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిమిత వేగంతో ప్రయాణిద్దాం..



ఇబ్రహీంపట్నం: భద్రతా వారోత్సవాల ర్యాలీ

- సురక్షితంగా ఇంటికి చేరుకుందాం: విద్యార్థుల అవగాహనర్యాలీ
- ఘనంగా రోడ్డు భద్రతా మాసోత్సవాలు

ఇబ్రహీంపట్నం: 'అతివేగం వద్దు. పరిమిత వేగంతో ప్రయాణిద్దాం. సురక్షితంగా ఇంటికి చేరుకుందాం' అని విద్యార్థులు నినదించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని ఇబ్రహీంపట్నంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. రోడ్డు రవాణ నిబంధనలు పాటిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం అంటూ నినదిస్తూ.. ప్లకార్డులతో అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. మండల విద్యాధికారి హిరియానాయక్, ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, లావణ్య, వ్యాయామ ఉపాధ్యాయులు సుశీల, రాములు, విజయభాస్కర్, రాజునాయక్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ లలిత, ఎంపీడీఓ కుసుమమాధురి, మున్సిపల్ కమిషనర్ వసంత, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ లక్ష్మణ్, ఎస్ఐ వెంకటేశ్, ఎంఈఓ పాండు, ప్రధానోపాధ్యాయురాలు రామలక్ష్మి, సీఆర్‌పీలు కిషన్ పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ శ్రీకాంత్, ఎస్ఐ శ్రీకాంత్, ఎంఈఓ చంప్లానాయక్ ఉన్నారు.

యాచారంలో..



యాచారం: సాగర్ రోడ్డులో ర్యాలీ

యాచారం: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తగా వాహనాలు నడపాలని ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఇందులో మండల విద్యాధికారి పాండురంగారెడ్డి, హెచ్‌ఎం నర్సింహ, పీడీ మల్లేశ్, ఎస్ఐ మధు పాల్గొన్నారు.

సర్కారు బడుల అభివృద్ధికి కృషి

ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సీఐ

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, అందులో చదువుకునే చిన్నారులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆదిబట్ల సీఐ ఎస్.రాఘవేందర్‌రెడ్డి సూచించారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన శిగ విజయలక్ష్మి వీరస్వామిగౌడ్‌ల సహకారంతో ఆయన స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థులు 50 మందికి స్టడీ మెటీరియల్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు టెన్త్ క్లాస్ ఎంతో ముఖ్యమైనదని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రావు, కౌన్సిలర్లు శ్రీనివాస్, మహేందర్, ఎస్‌ఎంసీ చైర్మన్ సునీతారెడ్డి, వార్డు మాజీ సభ్యులు రవీందర్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మనోహర్, యాదయ్య, పురుషోత్తం పాల్గొన్నారు.

నెలాఖరులో విగ్రహ ప్రతిష్ఠాపనలు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ కంఠ మహేశ్వరస్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 30,31 తేదీల్లో ఆంజనేయస్వామి, మైసమ్మతల్లి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగారవీందర్‌గౌడ్, గౌడసంఘం మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్‌లు తెలిపారు. 30న ధ్వజారోహణం, గోపూజ, మహాగణపతి పూజ, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, హోమం, 31న ఉదయం యంత్రప్రతిష్ఠ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, ఆలయ ఆవరణలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లురవి, మాజీ ఎమ్మెల్యేలు చల్లా వంశీచంద్‌రెడ్డి, జైపాల్ యాదవ్, జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారని వెల్లడించారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణకు ఆహ్వానిస్తూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో బుధవారం గౌడసంఘం నాయకులు ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఎల్లమ్మ భక్తులకు ఇక్కట్లు

- వెంచర్ గేట్ తెరవని రియల్టర్లు
- ఆలయానికి చేరుకోవడాని భక్తుల ఇబ్బంది



రావిర్యాలలో వెంచర్ గేటుకు చైన్‌తో తాళం వేసిన నిర్వాహకులు

తుక్కుగూడ: జిల్లాలో అతిపెద్ద ఆలయాల్లో రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం ఒకటి. ఈ ఆలయానికి ప్రతి మంగళవారం జిల్లా నలుమూలలతో పాటు, గ్రేటర్ హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు వస్తుంటారు. దేవాలయానికి చేరుకోవడానికి ఉన్నది ఒకే ఒక మార్గం రావిర్యాల గ్రామం నుంచి. ఈ రోడ్డు పూర్తిగా సింగిల్ రోడ్డు కావడం, రావిర్యాల పెద్ద చెరువుకు ఆనుకొని ఉండటంతో నిత్యం మరమ్మతులకు గురవుతుంది. సింగిల్ రోడ్డు కావడంతో భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. నెహ్రూ ఔటర్ సర్వీస్ రోడ్డు నుంచి ఆలయానికి చేరుకోవచ్చు. ఈ మధ్యలో ఉన్న హెచ్‌పీఆర్ వెంచర్ రోడ్డు నుంచి రావాలి. కానీ వెంచర్ నిర్వాహకులు గేట్ తెరవకపోవడంతో భక్తులు ఇక్కడి నుంచి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. నిబంధనల ప్రకారం.. వెంచర్ వేసిన మూడేళ్ల అనంతరం రోడ్డును ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కానీ.. పదేళ్లు కావస్తున్నా రోడ్డును ప్రజలు వినియోగించుకోకుండా గేట్‌కు తాళం వేసుకుంటున్నారు. ఇదే విషయమై.. పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారని బీజేపీ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్ తెలిపారు. పుర అధికారులు స్పందించి త్వరగా గేట్ ఓపెన్ చేసి, భక్తుల కష్టాలు తీర్చాలని ఆయన డిమాండ్‌ చేశారు.

కుమ్మరుల అభివృద్ధికి సహకరిస్తాం

హయత్‌నగర్: ఆర్థికంగా వెనుకబడిన కుమ్మరులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్‌లో కుమ్మర సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడుందని పేర్కొన్నారు. బీసీ జనగణన ఆధారంగా ప్రతి బీసీ కులానికి సంక్షేమ పథకాలను అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం గ్రామ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు జంగయ్య, బాలరాజ్, శ్రీనివాస్, ఎల్లేశ్వర్, రవితేజ, కిరణ్, రాజేందర్, రవి, సురేష్, కృష్ణ, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

మహేశ్వరం: నియోజకవర్గ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శుక్రవారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధి మన్సాన్‌పల్లి చౌరస్తాలో నిర్వహించే జాబ్ మేళాకు సుమారు 20 మల్టీ ఇంటర్‌నేషనల్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. ఇందులో సుమారు 3వేల ఉద్యోగాలు ఉన్నాయని, ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు జీతం ఉంటుందని వివరించారు. 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకొని, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యాయవాదులకు ఆటల పోటీలు



క్యారమ్ ఆడుతున్న న్యాయవాదులు

ఇబ్రహీంపట్నం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం జూనియర్ సివిల్ జడ్జి యశ్వంత్‌సింగ్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఇందులో అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్, ఉపాధ్యక్షుడు రమేష్, క్రీడా కార్యదర్శి గణేశ్, ఈసి మెంబర్ జగన్, సీనియర్ న్యాయవాదులు గులాం హైదర్, మాదన్న, గురుప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

కందుకూరు: మండలంలోని పులిమామిడిలో చీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ చైర్మన్ మొకరాల రాజశేఖర్‌శర్మ బుధవారం కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. దేవాదాయశాఖ మంత్రి సురేఖ ప్రభుత్వ పరంగా ఉత్సవాలు నిర్వహించడానికి అంగీకరించారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

'అలకానంద' ఆస్పత్రిని మూసివేయాలి

వైద్యులు, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి: ఏఐవైఎఫ్ డిమాండ్



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హుడాకాంప్లెక్స్: నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు పాల్పడిన సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలోని అలకానంద మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి వద్ద నిర్వహించిన ధర్నాలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. ఆస్పత్రి యాజమాన్యం 9 పడకలకు అనుమతి పొంది, 30 పడకలను అక్రమంగా నిర్వహిస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగితే కాని స్పందించరా అని ప్రశ్నించారు. ఈ హాస్పిటల్‌ను సీజ్ చేయడంతో పాటు, ప్రత్యేక విభాగాన్ని నియమించి రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రులను సోదాచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.బాలకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మధు, పి.శివకుమార్, సహాయ కార్యదర్శి వీరేష్, వెంకటేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.